సాక్షి
జోగుళాంబ గద్వాల

శనివారం । 10 । మే । 2025



వేసవిలో 'చల్లని' సేవ
వేసవిలో చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు బాటసారుల దాహార్తి తీరుస్తున్నాయి.

వివరాలు 10లో ▸



నేటినుంచి బ్రహ్మోత్సవాలు
బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /23.8

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



కేటీదొడ్డి: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుచినెర్ల గ్రామ రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన పాలెం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే పంటల సాగుపై దృష్టిసారించాలన్నారు. సేంద్రియ ఎరువులు, రసాయనాల వినియోగం, సాగునీటి ఆదా, మట్టి పరీక్షలు, వర్షాధార వ్యవసాయంలో నీటిని సంరక్షించే చర్యలు, పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు, చెట్ల పెంపకంతో కలిగే లాభాలు, యూరియా వాడకాన్ని సరైన మోతాదులో వాడాలని, రసాయనాలను తగు మోతాదులో వాడాలని, రైతులు షాపులలో కొన్న విత్తనం పురుగు, తెగుళ్ల కలుపు మందులకు రశీదు భద్రపరుచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు ఉపయోగపడతాయని తెలిపారు. ఆయిల్‌పాం తోటల సాగు, యాజమాన్య పద్ధతుల్లో మెలకువలు వివరించారు. **అనంతరం రైతు ముంగిట్లో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో** జిల్లా **కోఆర్డినేటర్ చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల వ్యవసాయాధికారి సాజిద్ రెహమాన్, ఏఈఓలు** ప్రియాంక, **కిరణ్‌కుమార్, మమత, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.**

1,105 క్వింటాళ్ల వేరుశనగ రాక

గద్వాల **వ్యవసాయం: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం** 1,105 **క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. కాగా క్వింటాల్ గరిష్టంగా** రూ.6,200, కనిష్టంగా రూ.3,700, సరాసరిగా రూ.5,200 చొప్పున పలికింది. అలాగే 64 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టంగా రూ.5,812, కనిష్టంగా రూ.3,680, సరాసరిగా రూ.5,812, 4 క్వింటాళ్ల కంది రాగా గరిష్టంగా రూ.6,066, కనిష్టంగా రూ.4,689, సరాసరిగా రూ.4,899, 646 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టంగా రూ.1,876, కనిష్టంగా రూ.1,550, సరాసరిగా రూ.1,766 ధరలు లభించాయి.

డిగ్రీ ఫలితాలు విడుదల



బిజినేపల్లి: మండలంలోని పాలెం అటానమస్ డిగ్రీ కళాశాల రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్‌లో 43 శాతం ఉత్తీర్ణత సాధించారని, విద్యార్థులు తమ ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. మార్కుల పునఃమూల్యాంకనం కోసం ఈ నెల 17 వరకు తమ దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలన్నారు. ఫలితాలను పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఎగ్జామినేషన్ కంట్రోలర్ రాజ్‌కుమార్, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, అనురాధరెడ్డి విడుదల చేయగా.. కళాశాల అడిషనల్ కంట్రోలర్ శివ, సిబ్బంది శ్రీనివాస్, నాగరాజు, సుష్మ, వెంకటేష్, యాదగిరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కండక్టర్ల బదిలీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని పది ఆర్టీసీ (రీజియన్) డిపోల్లో పనిచేస్తున్న 89 మంది కండక్టర్లకు వారి అభ్యర్థన మేరకు బదిలీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టి 80 మంది అభ్యర్థులకు కండక్టర్లుగా వివిధ డిపోల్లో పోస్టింగులు ఇచ్చామని, అలాగే 89 మంది రెగ్యులర్ కండక్టర్లకు వారి అభ్యర్థన మేరకు బదిలీలు చేశామని ఆర్‌ఎం తెలిపారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న తమ బదిలీలను చేపట్టినందుకు కండక్టర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్‌ఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం.. అమలైతేనే ప్రయోజనం

జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగంపై ముమ్మరంగా తనిఖీలు

- పూర్తిస్థాయిలో అరికట్టేందుకు మరోసారి అడుగులు
- కలెక్టర్ దిశానిర్దేశంతో కఠిన చర్యలకు ఉపక్రమణ
- నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 10 టన్నులు సేకరణ



జిల్లాకేంద్రంలోని ఓ వైన్స్‌లో ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

గద్వాల టౌన్: ఉదయం నుంచి నిద్రించే వరకు ప్లాస్టిక్‌తో మానవ జీవితం ముడిపడి ఉంటోంది. అంతలా కలిసిపోయిన దీంతో పర్యావరణంతో పాటు మానవవాళికి ముప్పుపొంచి ఉందని తెలిసినా వినియోగిస్తూనే ఉన్నాం. పర్యావరణ వేత్తలు, ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా.. కొద్దిగానైనా మార్పు రావడం లేదు. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా వీటి వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. పట్టణాల్లోని రహదారుల పక్కన, నివాస గృహాల సమీపంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం ఉండేది. ప్రస్తుతం 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించాలంటే వ్యక్తిగతంగా, సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని.. అప్పుడే పర్యావరణ ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మార్పు వచ్చినట్టే వచ్చి..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 30 వేల నివాస గృహాలు, దుకాణాలు ఉన్నాయి. దీంతో ప్రతిరోజు 80 టన్నుల చెత్త పోగవుతోంది. అందులో 10 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. గతంలోనే గద్వాల, అయిజ మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధం అమలు చేశారు. అప్పట్లో అడపాదడపా దుకాణాలపై దాడులు నిర్వహించారు. రూ.100 నుంచి రూ.5 వేల వరకు జరిమానా సైతం విధించారు. తదనంతరం అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తిరిగి వాటి విక్రయాలను మొదలుపెట్టారు. ఏళ్ల తరబడి ప్రణాళిక రూపొందిస్తున్నా.. కౌన్సిల్‌లో తీర్మానాలు చేస్తున్నా.. అమలులో క్షేత్రస్థాయి లోపాలతో అడ్డుకట్ట పడటం లేదు.

ముమ్మరంగా తనిఖీలు..

ప్రస్తుతం ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు మళ్లీ నడుం బిగించారు. గడిచిన కొన్ని రోజులుగా ఆయా మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా జిల్లాకేంద్రమైన గద్వాలలో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. కలెక్టర్ సంతోష్ ఆదేశాలతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో దుకాణాలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నారు. కూరగాయల మార్కెట్‌తో పాటు హోల్‌సేల్, రిటేల్ దుకాణాల్లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని కార్యాయాలకు తరలించారు. ఆయా పార్టీల నుంచి రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా ఎక్కడా తగ్గకుండా దాడులు కొనసాగిస్తూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ప్రజల్లో మార్పు రావాలి..



ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. పాలిథీన్ కవర్లకు బదులు ఇతర సంచులు వాడాలని, తద్వారా ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుందని చెబుతున్నాం. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే వంద శాతం ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుంది. ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే జరిమానాలతో పాటు దుకాణం లైసెన్సు రద్దు చేస్తాం.

– దశరథ్, మున్సిపల్ కమిషనర్, గద్వాల

'జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. ఆన్‌లైన్ ద్వారా పరిచయం అయిన యువకుడితో ప్రేమలో పడింది. విషయం తెలిసిన ఆమె తల్లిదండ్రులు ఆమెకు ఏపీకి చెందిన యువకుడితో పెళ్లి ఖరారు చేశారు. మూడు నెలల కిందట ఏపీ పరిధిలోని ఓ ఆలయం సమీపంలో మైనర్ బాలికకు వివాహం జరిపించారు. ఈ విధంగా మైనర్ బాలికలకు పెళ్లిళ్లు చేస్తున్న ఘటనలు జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎక్కువగా నమోదవుతున్నాయి. '

'నాగర్‌కర్నూల్ జిల్లాలోని మైనర్ బాలికకు ఓ యువకుడు ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం అయ్యాడు. ప్రేమ పేరుతో కొన్నాళ్లుగా చాటింగ్ చేసిన తర్వాత తరచుగా కలుసుకునేవాళ్లు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు ఆ బాలిక మైనర్‌గా ఉండగానే వివాహం జరిపించారు. ఆన్‌లైన్ పరిచయాలు ప్రేమగా మారుతుండటం, మైనర్ ప్రేమల నేపథ్యంలో మైనర్ వివాహాలు చోటుచేసుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయి.'

ఆన్‌లైన్ వేదికలు.. టీనేజ్ ప్రేమలు

సోషల్ మీడియా ద్వారా కొత్త పరిచయాలు

- మైనర్ ఏజ్‌లోనే పెళ్లిళ్లు చేసుకుంటున్న వైనం
- ఆన్‌లైన్, మొబైల్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలంటున్న చైల్డ్ సేఫ్టీ అధికారులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న ఘటనలు



సాక్షి, నాగర్‌కర్నూల్: ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, స్నాప్ చాట్, వాట్సప్.. తదితర సామాజిక మాధ్యమాల్లో నిత్యం గంటల తరబడి గడపడం ప్రస్తుతం టీనేజర్లకు సాధారణంగా మారింది. ఇదే క్రమంలో ఆన్‌లైన్ వేదికల ద్వారా కొత్తగా పరిచయం అయిన వారి పట్ల ఆకర్షితులవుతున్నారు. వీరిలో మైనర్లే ఎక్కువగా ఉంటున్నారు. బాల్య దశలోనే ప్రేమ పేరుతో ఇల్లు విడిచి వెళ్లిపోవడం, మైనర్ ఏజ్‌లోనే పెళ్లిళ్లు చేసుకుంటున్న ఘటనలు ఉమ్మడి జిల్లాలో తరచుగా చోటు చేసుకుంటున్నాయి. చాలావరకు ఘటనలు సంబంధిత అధికారుల దృష్టికి సైతం రావడం లేదు. తీరా మైనర్‌గా ఉన్న బాలికలకు వివాహతంతు పూర్తయ్యాక అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి.

ఆన్‌లైన్ ప్రేమలపైనే ఎక్కువగా ఫిర్యాదులు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాలల సంరక్షణ అధికారులకు కొన్నేళ్లుగా ఆన్‌లైన్ ప్రేమలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. **ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్** వంటి **ఆన్‌లైన్ వేదికల ద్వారా పరిచయమై** ప్రేమ **పేరుతో మైనర్ బాలికలు తమను విడిచివెళ్లిపోవడం, పెళ్లిళ్లు చేసుకోవడంపై** తల్లిదండ్రులు **చైల్డ్ సేఫ్టీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. తొమ్మిది, పదో తరగతులు,** ఇంటర్ **చదువుతున్న మైనర్ బాలికలు** ఎక్కువగా ఈ ప్రభావానికి లోనవుతున్నారు. ఆన్‌లైన్‌లో పరిచయం అయిన వ్యక్తుల పూర్తి వివరాలు తమకు తెలియకున్నా వారిని నమ్మి మైనర్ బాలికలు ఇల్లు విడిచి వెళుతున్నారు. ఈక్రమంలో మైనర్ వయసులోనే పెళ్లిళ్లు చేసుకోవడం, మరికొంతమంది మోసపోయామని తెలిసి ఇంటిబాట పడుతున్నారు. చాలావరకు ఘటనలు అధికారుల దృష్టికి రావడం లేదు. గతేడాది నారాయణపేట జిల్లాలో 46, జోగుళాంబ గద్వాల జిల్లాలో 42, నాగర్‌కర్నూల్‌లో 36, వనపర్తిలో 47, మహబూబ్‌నగర్‌లో 47 ఇలాంటి ఘటనలు గుర్తించారు. వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరిలో 54 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే ఈ ఏడాది ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 97 ఫిర్యాదులు అందగా.. 16 కేసులు నమోదయ్యాయి.

కఠిన నిబంధనలు ఉన్నా..

మైనర్ వివాహాలు జరిపిస్తే కఠినమైన చట్టాలు, నిబంధనలు ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మైనర్ పెళ్లిళ్లు కొనసాగుతున్నాయి. మైనర్ బాలికలను వివాహం చేసుకుంటే యువకుడు, బంధువులతో పాటు బాధ్యులైన వారందరిపై కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. చాలాసందర్భాల్లో ఈ నిబంధనలు అమలుకావడం లేదు. మండలస్థాయిలో చైల్డ్ మ్యారేజీ ప్రొహిబిషన్ ఆఫీసర్లుగా సంబంధిత ఎమ్మార్వోలు, జిల్లాస్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా, చాలావరకు వివాహాలు జరిగాక కేవలం కౌన్సిలింగ్‌లకే పరిమితమవుతున్నారు. చిన్నవయసులోనే ఆన్‌లైన్ ద్వారా పరిచయాలు ప్రేమ వ్యవహారాలకు దారి తీస్తుండటంతో తల్లిదండ్రులే మైనర్ బాలికలకు గుట్టుగా వివాహాలు జరిపిస్తున్నారు. మరికొంత మంది మైనర్ దశలోనే ఆన్‌లైన్ పరిచయస్తులను నమ్మి ఇల్లు విడిచి వెళ్లిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం..

చిన్నవయసులోనే మొబైల్ ఫోన్, ఆన్‌లైన్‌లో పరిచయాలతో మైనర్ దశలోనే బాలికలు ఆకర్షణకు గురవుతున్నారు. మైనర్ ఏజ్‌లోనే పెళ్లిచేసుకోవడం, తల్లిదండ్రులను విడిచి వెళ్లిపోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. చైల్డ్ సేఫ్టీ అధికారుల ద్వారా మైనర్ పెళ్లిళ్లపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– రాజేశ్వరి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, నాగర్‌కర్నూల్

18న నల్లమలకు సీఎం రాక



అధికారులు, చెంచులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ బదావత్ సంతోష్

మన్ననూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లమల పర్యటన నేపథ్యంలో ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో సభాస్థలం ఇతరత్రా ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. ఆదివాసీల కోసం రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా రూ.12,600 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిర సౌర గిరి జల వికాస పథకం ప్రాజెక్టును ఈ నెల 18న సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. అలాగే జిల్లా అధికారులు, ఐటీడీఏతో అనుసంధానంగా ఉన్న అధికారులు, సిబ్బందితోపాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చే ఆదివాసీలతో సమావేశం ఉంటుందన్నారు. ఈ క్రమంలో అనుకూల ప్రదేశం కోసం పదర మండలంలోని పెట్రాల్‌చేన్, అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, మాచారం, వెంకటేశ్వర్లబావి గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ రోహిత్‌రెడ్డి, డీటీడీఓ ఫిరంగి, ఐటీడీఏ ఏఓ జాఫర్ ఉస్సేన్, మండల అధికారులు, చెంచులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, పక్కన అదనపు కలెక్టర్ నర్సింగరావు తదితరులు

గద్వాల: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పనుల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతిని మండలాల వారీగా సమీక్షిస్తూ మంజురైనా ఇళ్ల నిర్మాణ పనుల్లో గ్రౌండింగ్, బేస్‌మెంట్, మార్క్ అవుట్, రీ వెరిఫికేషన్ తదితర అంశాలను అధికారుల నుంచి వివరంగా అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వం సహాయం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపికలో ఆధార్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు అన్ని అర్హత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసి కార్పొరేషన్ బ్యాంకుల వారీగా సంబంధిత బ్యాంకులకు పంపించాలని, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు వాటిని పరిశీలించి అర్హత నివేదిక సమర్పించాలన్నారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హత ఉన్న వారిని ఎంపిక చేయాలన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చిన రైతుల ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యం సేకరించి మిల్లులకు తరలించాలన్నారు. గాలి, దుమ్ము, అకాల వర్షాలు పడుతున్నందున వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, ఎల్డీఎం శ్రీనివాసరావు, పౌరసరఫరాల అధికారి స్వామికుమార్, డీఎం విమల, పీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్ ఘనీ

గద్వాల టౌన్: జిల్లా విద్యాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీఈఓ మహ్మద్ అబ్దుల్ ఘనీ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బాలభవన్‌లో ఏర్పాటు చేసిన మండల విద్యాధికారుల విద్యా సంవత్సర సన్నాహక సమావేశంలో డీఈఓ పాల్గొని మాట్లాడారు. విద్యా వ్యవస్థ అభివృద్ధిలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ముందుండి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర అధికారులు సూచించిన అన్ని కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు విధిగా పాల్గొనేలా చూడాలని సూచించారు. బడిబాట, యూడైస్, మార్కుల అప్‌లోడింగ్, శిక్షణ కార్యక్రమాలు, కాంప్లెక్స్ సమావేశాలు తదితర వాటిలో సహకరించాలని కోరారు. సీఆర్పీలు, ఎంఐఎస్‌లు, కోఆర్డినేటర్లు, సీసీఓలు డేటా నమోదులో చురుకుగా వ్యవహరించాలని చెప్పారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను అభినందించారు. రాబోయే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారులు ఎస్తేర్‌రాణి, ఫర్హానాబేగం, డీసీబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడుకు నీటి సరఫరా నిలిపివేత

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి శుక్రవారం నీటి సరఫరా నిలిపివేశారని.. ప్రస్తుతం జలాశయంలో సముద్ర నీటిమట్టానికి పైన 1,015 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని, జలాశయం నుంచి కుడి, ఎడమ కాల్వలకు 10 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలి



ఎర్రవల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి వ్యతిరేకంగా పాకిస్తాన్ ఉగ్రమూకలపై భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఈఓ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతల దృష్ట్యా శత్రు దేశానికి మన దేశ త్రివిధ దళాల సైనికులు తగిన గుణపాఠం చెప్పాలని, అలాగే వారికి దైవిక బలంతోపాటు రక్షణ, ఆంజనేయస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ అర్చకులు వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మారుతిచారి, సందీప్‌చారి, సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి సదస్సులను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

ఇటిక్యాల: రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిళిరావులచెర్వు గ్రామంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆర్డీఓ పాల్గొని రైతుల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రారంభించిందని, జిల్లాలోని ఇటిక్యాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని వివరించారు. గతంలో ప్రజలు అధికారులను కలవాల్సి వచ్చేదని, ఇప్పుడు అధికారులే గ్రామాల్లోకి వచ్చి నేరుగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి నెలాఖరులోగా అర్హులైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామని, రైతులు నిర్దేశిత ప్రొఫార్మాలో దరఖాస్తులు అందించాలని సూచించారు. ఈ సదస్సులో భూ రికార్డుల సవరణలు, విస్తీర్ణ మార్పులు, వారసత్వ సమస్యలు, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదాబైనామాలు, సర్వే నంబర్ గల్లంతు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ తదితర సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు వీరభద్రప్ప, నరేష్, పంచాయతీ కార్యదర్శి హారిక, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కేటీదొడ్డి: జిల్లాలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ఉపాధి హామీ పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలకుంట గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ఓఆర్‌ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల షెడ్‌పాటు ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించి నాణ్యత, నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

వేసవిలో 'చల్లని' సేవ


మరికల్ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్న దాతలు(ఫైల్)

- తీలేర్ అంబలి కేంద్రానికి 44 ఏళ్లు పూర్తి
- వేసవిలో ప్రజల దాహార్తి తీరుస్తున్న దాతలు

మరికల్: వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఎంతో మంది స్వచ్ఛందంగా అంబలి, చలి వేంద్రాలు ఏర్పాటు చేసి దాతృత్వం చాటుకుంటున్నారు. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొట్టమొదట దివంగత మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి కుటుంబ సభ్యులు మరికల్ మండలం తీలేర్ స్టేజీ వద్ద అంబలి కేంద్రం ఏర్పాటు చేశారు. వీరి స్ఫూర్తితో మరికల్ మండల అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. 22 ఏళ్లుగా ప్రతి వేసవిలో బాటసారులు, కూలీల దాహార్తి తీరుస్తున్నారు. వీరి ఆదర్శంతో ఇతర మండలాలు, గ్రామీణ స్టేజీల వద్ద అంబలి కేంద్రాలను ఏర్పాటుచేసి వేసవిలో చల్లని సేవ అందిస్తున్నారు.

44 ఏళ్ల క్రితం..

ఈ ప్రాంత ప్రజలు రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితుల్లో మండుటెండలను సైతం లెక్క చేయకుండా పడుతున్న శ్రమను చూసి దివంగత మాజీ ఎమ్మెల్యే కె.వీరారెడ్డి తండ్రి వెంకారెడ్డి చల్లించిపోయారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గాను 1981లో తీలేర్ స్టేజీ వద్ద అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇలా ప్రతి ఏడాది వేసవిలో అంబలి కేంద్రం నిర్వహిస్తూ వ్యవసాయ కూలీలతో పాటు బాటసారుల దాహం తీర్చేవారు. అయితే వెంకారెడ్డి మరణానంతరం ఈ బాధ్యతను మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి కొనసాగించారు. అతడి మరణం తర్వాత ఆయన కుమారుడు, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తన అవ్వ వజ్రమ్మ, తాత వెంకారెడ్డి, తండ్రి వీరారెడ్డి జ్ఞాపకర్థంగా అంబలి కేంద్రాన్ని కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


తీలేర్ స్టేజీ వద్ద ఏర్పాటుచేసిన అంబలి కేంద్రం

అయ్యప్ప అనుగ్రహంతోనే సేవ..



అయ్యప్ప సేవాసమితి స్థాపించిన నాటి నుంచి బాటసారుల తీర్చేందుకు అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. అయ్యప్పస్వామి అనుగ్రహంతో 22 ఏళ్లుగా అంబలి కేంద్రాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగిస్తున్నాం. భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తాం.

– సతీశ్‌కుమార్, మరికల్

ఆనందంగా ఉంది..



మరికల్ బస్టాండ్, చౌరస్తాలో యువక మండలి తరఫున చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నాం. 30 ఏళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– శ్రీకాంత్‌రెడ్డి, యువక మండలి అధ్యక్షుడు, మరికల్

అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో..

మండల అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో మరికల్‌లో ఏర్పాటుచేస్తున్న అంబలి కేంద్రం 22 ఏళ్లు పూర్తి చేసుకుంది. అయ్యప్పస్వామి పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రతి ఏడాది వేసవిలో భక్తులు మరికల్‌లో స్వచ్ఛందంగా అంబలి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తూ వస్తున్నారు. వీరి సేవలను ఆదర్శంగా తీసుకున్న వివిధ గ్రామాల దాతలు తమ గ్రామాల్లో కూడా అంబలి, చలి వేంద్రాలను ఏర్పాటుచేసి మానవత్వం చాటుకుంటున్నారు.

ఊరూరా చలివేంద్రాలు..

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు కొన్నేళ్లుగా ఊరూరా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మరికల్ సత్యసాయి సేవాసమితి, యువక మండలి ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో చలివేంద్రాలను ఏర్పాటుచేసి.. ప్రయాణికులు, బాటసారుల దాహం తీరుస్తున్నారు.

నేటి నుంచి బీచుపల్లి బ్రహ్మోత్సవాలు


గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- ఐదు రోజుల పాటు వేడుకలు
- 12న ఆంజనేయస్వామివారి రథోత్సవం
- వేలాది తరలిన రానున్న భక్తులు

ఎర్రవల్లి: అపర మంత్రాలయంగా పేరుగాంచిన బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయన అర్చకులు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం పంచామృతాభిషేకం, వాస్తుపూజ హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణ, రాత్రికి తెప్పోత్సవం, ఆదివారం ఉదయం పంచామృతాభిషేకం, స్వామివారి ఉపనయనం, రాత్రికి ప్రభోత్సవం, సోమవారం ఉదయం పంచామృతాభిషేకం, వ్యాసపూజ, మధ్యాహ్నం సీతారాముల కల్యాణం, బలిహరణము, సాయంత్రం రథంగ హోమం, రాత్రికి కుంభం, రథోత్సవం, మంగళవారం ఉదయం పంచామృతాభిషేకం, చౌకిసేవ, బలిహరణం, రాత్రికి ప్రభోత్సవం, బుధవారం ఉదయం అమృతస్నానం, పంచామృభిషేకం, రాత్రికి పల్లకీసేవతో ఆంజనేయ స్వామి ఉత్సవాలు ముగుస్తాయి.

ఆలయంలో నిత్య పూజలు

ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రతి రోజు ఉదయం 07:30 లకు ఆకుపూజ, అభిషేకం నిర్వహిస్తారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాల సమయంలో నాలుగు శనివారాల్లో కూడా భక్తులు స్వామివారికి దాసంగాలు సమర్పిస్తారు. ఆలయ సమీపంలో దక్షిణవాహినిగా పేరుగాంచిన పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాతే భక్తులు స్వామివారి దర్శనానికి వెళ్తారు. ప్రతి అమావాస్య రోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపడతారు.


బీచుపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి మూలవిరాట్

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఆంజనేయస్వామి ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ రామన్‌గౌడ్ తెలిపారు. ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


చిట్టయ్య(ఫైల్)

వెల్దండ: చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన చిట్టయ్య(65) మేకల కాపరిగా ఉండేవాడు. ఈనెల 5వ తేదీ సాయంత్రం నుంచి ఇంటికి రాలేదు. మద్యానికి బానిసై అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి 10 రోజులకోసారి వచ్చేవాడు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం దుర్వాసన రావడంతో సమీప పొలాల రైతులు హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి సమీపంలోని ప్రభుత్వ భూమిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న పోలెమోని చిట్టయ్య(65)ను గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ కురుమూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుళ్లిపోవడంతో సంఘటనా స్థలంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిట్టయ్యకు భార్య బాలమ్మ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యనిప్పంటించిన ఘటనలో చికిత్స పొందుతూ భర్త మృతి

జడ్చర్ల టౌన్: నాలుగు రోజుల క్రితం వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించగా, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కావేరమ్మపేటకు చెందిన చింతకుంట రాములు(52), తిరుపతమ్మ భార్యాభర్తలు. భార్యాభర్తల మధ్య గొడవలు అవుతుండేవి. దీంతో నాలుగు రోజుల క్రితం భార్య రాములుపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. దీన్ని గమనించిన చుట్టు పక్కల వారు వెంటనే కాలిన గాయాలతో ఉన్న అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. కాగా జిల్లా ఆస్పత్రిలోనే రెండురోజుల క్రితం మరణవాంగ్మూలం నమోదు చేశారు. ఘటనపై రాములు సోదరుడు యాదయ్య జడ్చర్ల పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. వివాహం జరిగిన నాటి నుంచి అన్నతో వదిన గొడవలు పడేదని, అదే క్రమంలో పెట్రోలు పోసి నిప్పంటించిందని ఫిర్యాదులో పొందుపర్చాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతమ్మను పోలీసులు అదుపులోకి తీసుకుని, అంత్యక్రియల నిమిత్తం సాయంత్రం వరకు అనుమతిచ్చారు.

ఇద్దరు పిల్లలతో సహాతల్లి అదృశ్యం




అదృశ్యమైన తల్లి, ఇద్దరు పిల్లలు.(ఫైల్)

నవాబుపేట: ఇంట్లో అందరు నిద్రిస్తూ ఉండగా తల్లి ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన సంఘటన మండలంలోని తీగలపల్లి శుక్రవారం చోటుచేసుకుంది. జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన ఎడ్ల కృష్ణయ్య కుటుంబంతో ఐదేళ్ల క్రితం మండలంలోని తీగలపల్లికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కృష్ణయ్యకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 7వ తేదీన అందరు తిని నిద్రించిన తరుణంలో తెల్లవారుజామున భార్య శ్రీదేవి (35) ఆయన ఇద్దరు కుమారులు విశ్వప్రసాద్(7), అఖిల్(5)లు కనిపించకుండ పోయారు. దీంతో ఆయన చుట్టుపక్కల, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

భూత్పూర్: మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రెండు వెర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నాసాగర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామానికి చెందిన యనమల రామ సంజీవరెడ్డి(35) జిల్లా కేంద్రంలోని ఓ గుత్తేదారు వద్ద ట్రాక్టర్‌తో పనులు చేయటకు వచ్చాడు. పని పూర్తి చేసుకొని తిరిగి స్వగ్రామానికి గురువారం రాత్రి ట్రాక్టర్‌పై వెళ్తుండగా అన్నాసాగర్ సమీపంలోని జాతీయ రహదారిపై పక్కనే ఉన్న రేలింగ్‌కు అదుపు తప్పి ఢీకొట్టాడు. దీంతో రామసంజీవరెడ్డి ట్రాక్టర్‌పై నుంచి ఎగిరిపడి ట్రాలీ టైర్ మీదపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శుక్రవారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చిన్నాన్న యనమల లక్ష్మీనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో ప్రమాదంలో భూత్పూర్ పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్‌ను శేరిపల్లి (బి) బస్టాప్ నుంచి భూత్పూర్ వైపుకు మలుపుతుండగా జడ్చర్ల వైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లుకు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. శేరిపల్లి (బి) గ్రామానికి చెందిన కృష్ణ ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలంలో గాయపడిన వెంకటేశ్వర్లును 108 లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ తిరుమల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


అన్నాసాగర్ వద్ద ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన రామసంజీవరెడ్డి

ఎకో టూరిజం స్థల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి గ్రామ సమీపంలో ఫారెస్టులో ఉన్న నడింతిప్ప ప్రాంతంలో శనివారం ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్ భరత్‌కుమార్ అటవీ శాఖ అధికారులతో కలిసి ఎకో టూరిజం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ బన్సీలాల్ మాట్లాడుతూ సర్వే నం.44లో 13 ఎకరాల భూమిలో ప్రభుత్వం ఎకో టూరిజం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించడంతో అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించామని చెప్పారు. ఫారెస్టు, రెవెన్యూ పరిధిలో వివాదంగా మారిన ఈ భూమి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీ..

- ఘటన స్థలంలోనే వృద్ధురాలి మృతి

చారకొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కురుమేటి శ్యామలమ్మ (60) శుక్రవారం రాత్రి కల్వకుర్తి –దేవరకొండ ప్రధాన రహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో శ్యామలమ్మ తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న చారకొండ ఎస్ఐ శంషోద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


జగపతిరెడ్డి (ఫైల్)

తాడూరు: రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన జగపతిరెడ్డి (55) శుక్రవారం పని నిమిత్తం ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరాడు. కల్వకుర్తి రహదారిలో పెట్రోల్‌బంక్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొట్టడంతో కిందపడిపోయిన జగపతి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు.

హైదరాబాద్‌లో కానిస్టేబుల్ మృతి


మహేందర్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహేందర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం హైదరాబాద్‌లోని మీర్‌పేట పీఎస్ పరిధిలో స్కూటీపై వెళుతుండగా.. గుర్తుతెలియని కారు వేగంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో కింద పడిన మహేందర్ తలకు బలమైన గాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మహేందర్ స్వస్థలం లింగాలలో విషాదఛాయలు అములుకున్నాయి. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు.

జై జవాన్..

పెళ్లి వేడుకలో వీర జవాన్‌కు ఘన నివాళి


జవాన్ మురళినాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నూతన దంపతులు

మరికల్: భారత్– పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో వీర మరణం పొందిన జవాన్ మురళినాయక్‌కు పెళ్లి వేడుకల్లో నూతన దంపతులు ఘన నివాళులర్పించారు. మరికల్ మండలంలోని గాజులయ్యతండాలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలో పెళ్లి కుమారుడు అనిల్‌నాయక్, పెళ్లి కూతురు రక్షితతోపాటు తండావాసులు కొవ్వొత్తులు వెలిగించి వీర జవాన్ సేవలను స్మరించారు. వీర జవాన్ మరణం వృథా కాదని, భారత్ మాతాకీ జై.. జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. గిరిజన కుటుంబంలో పుట్టి దేశం కోసం ప్రాణాలర్పించిన మురళినాయక్ సేవలు దేశ చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు.

వేడి పాలలో పడి రెండేళ్ల బాలుడికి తీవ్ర గాయాలు

జడ్చర్ల టౌన్: మరుగుతున్న పాలలో పడిన రెండేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైన విషాదకర ఘటన శుక్రవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని జడ్చర్లలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. జడ్చర్ల ప్రాంతంలోని ఓ మిల్క్‌సెంటర్‌లో పాలు మరుగుతుండగా ఆసెంటర్‌కు చెందిన రెండేళ్ల రాంచరణ్ ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. అది గమనించిన కుంటుంబ సభ్యులు బాలుడిని పాలలో నుంచి బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వేడి పాలలో పడటంతో శరీరం అంతా 80శాతం కాలడంతో ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి, 108లో జిల్లా ఆస్పత్రికి వైద్యులు పంపించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

తక్కువ పెట్టుబడితో సీడ్ డ్రిల్ విత్తు

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: జిల్లాలో రైతులు ఎక్కువగా విత్తనాలు వెదజల్లడం, నాగళి వెనుకసాళ్లలో వేసే పద్ధతులను అవలంబిస్తున్నారు. చిన్న కమతాల్లో ఇది తప్పనిసరి. అయితే పెద్ద కమతాల్లో సాగు చేసే వారు యంత్రాలను వినియోగించడం మంచిది. ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ డ్రిల్లర్లతో విత్తనాలు, ఎరువులు సమపాళ్లలో ఒకేసారి వేసుకోవచ్చు. దీని వలన తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచించారు. కూలీల సమస్యను అధికమించడానికి అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. సీడ్‌డ్రిల్ యంత్రంతో సాగు పద్ధతులను ఆయన రైతులకు వివరించారు.

ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ ఉపయోగాలు..

- అన్ని రకాల విత్తనాలు ఈ డ్రిల్‌తో వేయవచ్చును.
- 8 గంటల్లో 6 నుంచి 8 ఎకరాల్లో విత్తనాలు విత్తుకోవచ్చు.
- వర్షాధార భూముల్లో తేమ తగ్గక ముందే సకాలంలో విత్తనాలు వేసుకోనే అవకాశం ఉంటుంది.


సీడ్‌డ్రిల్ కమ్ ఫెర్టి డ్రిల్

- పంటను బట్టి వరుసల మధ్య దూరం, మొక్కల మధ్య దూరం మార్చుకోవచ్చు.
- విత్తనంతో పాటు ఎరువులు వేయడం వలన పంట తొలి దశలో ఆరోగ్యంగా పెరుగుతుంది. వేసిన ఎరువు మొక్కకు మాత్రమే అందడం వలన ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. పంటకు గాలి వెలుతురు బాగా తగిలి పంట ఆరోగ్యంగా పెరుగుతుంది.
- యంత్రాలతో వరి, వేరు శనగ, మొక్కజొన్న, పెసర, మినుములు, కొమ్ము శనగ, గోగు తదితర పంటలు వేసుకోవచ్చు.
- ఈ యంత్రాన్ని ఉపయోగించేటప్పుడు తప్పనిసరిగా పొలం చదునుగా ఉండాలి.
- చివరి దుక్కిలో రోటోవేటర్ ఉపయోగించాలి.
- పొలం చదునుగా ఉంటే పొలం అంత విత్తనం, ఎరువులు ఒకే మోతాదులో పడతాయి. ఒకేసారి మొలక శాతం వస్తోంది. యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుంది.

దూరం పాటించాల్సిందే...!

రకం	వరుసల మధ్య (సెం.మీ.)	మొక్కల మధ్య (సెం.మీ.)
వరి	25	15
మొక్కజొన్న	60	20
పామాయిల్	60	20
పెసర	25	10
గోగు	25-30	15
వేరు శనగ	30	15

సాగు ఇలా..

సీడ్‌డ్రిల్ యంత్రములో రెండు బాక్సులు ఉంటాయి. ముందు బాక్స్‌లో ఎరువులు వేయాలి. రెండవ బాక్స్‌లో విత్తనం వేయాలి. ఎరువు ముందు పడుతుంది. తర్వాత విత్తనం పడుతుంది.

బావిలో పడి ఇద్దరు దుర్మరణం

- మృతుల్లో ఓ యువకుడు, ఓ బాలుడు
- సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఘటన


శేఖర్(ఫైల్)


లక్ష్మణ్(ఫైల్)

హుజూర్‌నగర్: యువకుడు బావిలో పడిపోగా.. అతడిని కాపాడబోయి మరో యువకుడు అందులోకి దిగాడు. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీట మునిగి మృతిచెందారు. ఈ విషాదకర ఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన కన్మనూర్ తిరుపతయ్య, మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన మోదిపురం లక్ష్మణ్‌లు మరో ఆరుగురితో కలిసి గొర్రెలను మేపుకుంటూ హుజూర్‌నగర్‌కు వచ్చారు. గత పది రోజులుగా పట్టణానికి చెందిన జక్కుల లింగయ్య పొలంలో మేత కోసం గొర్రెలను నిలిపి అక్కడే ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం తిరుపతయ్య కుమారులైన శేఖర్, చరణ్ వేసవి సెలవులు కావడంతో తండ్రి వద్దకు వచ్చారు. శుక్రవారం తిరుపతయ్య పెద్ద కుమారుడైన శేఖర్, గొర్రెల కాపరి లక్ష్మణ్‌తో కలిసి నీటిని తీసుకువచ్చేందుకు సమీపంలో గల లింగయ్య బావి వద్దకు వెళ్లారు. లక్ష్మణ్ (21) నీళ్లు పట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు శేఖర్ (14)ప్రయత్నించగా అతను కూడా బావిలో పడ్డాడు. దీంతో ఇద్దరూ నీట మునిగి మృతిచెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మృతుడు శేఖర్ తండ్రి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.